



గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

'బురాన్‌పల్లి'ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తా

» స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బురాన్‌పల్లి గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బురాన్‌పల్లి గ్రామంలో పల్లెల్లో పనుల జాతర 2025లో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రూ.20 లక్షలతో పంచాయతీ భవనానికి శంకుస్థాపన, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బురాన్‌పల్లి వరకు రూ.63లక్షలతో చేపట్టిన నూతన బీటీ రోడ్డుకు, బురాన్‌పల్లి నుంచి ధన్నారం వరకు రూ.63 లక్షలతో నూతనంగా చేపట్టిన బీటీ రోడ్డులను స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తుందన్నారు. గత ప్రభుత్వం రద్దు చేసిన అసైన్మెంట్ కమిటీని పునరుద్ధరించి భూములు లేని పేదలకు భూములు ఇచ్చే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని తహసీల్దార్‌కు సూచించారు. ప్రతి సంక్షేమ పథకం మహిళల పేరున ఉండాలని ఉద్దేశంతో ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. ఇందులో భాగంగా ఉపాధి హామి కింద ఉద్యానవన మొక్కలు నాటేందుకు ప్రొసిడింగ్ కాపీలను స్పీకర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో వినయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఆర్టీఏ సభ్యులు జాఫర్, మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంకులో ఇంటి దొంగలు

ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన మహిళకు
తెలియకుండా డబ్బులు డ్రా
ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై కేసులు
7



జిల్లా వ్యాప్తంగా రోజురోజుకూ వీధికుక్కల బెడద తీవ్రమవుతోంది. ఒంటరిగా వీధుల్లోకి వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. గుంపులు గుంపులుగా తిరుగుతూ చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా దాడులకు తెగబడుతున్నాయి. వాహనాల వెంట పడుతుండటంతో రోడ్డు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. కుక్కలను చూసి వేగంగా నడిచినా.. బైక్‌పై వేగంగా వెళ్లినా వెంటపడుతూ దాడి చేస్తున్నాయి. గత మూడేళ్లలో వికారాబాద్ జిల్లాలో 7,907, మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో 409 కుక్కకాటు కేసులు నమోదయ్యాయి.



శునకం.. భయానకం!

గుంపులు, గుంపులుగా వీధుల్లో సంచారం
బయటకు వెళ్లాలంటేనే జంకుతున్న జనం
వాహనాల వెంట పడుతుండటంతో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
జిల్లాలో పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
పట్టించుకోని సంబంధిత అధికారులు



పిక్కలు పీకేస్తున్న వీధి కుక్కలు

కుక్కకాటు కేసులు (జిల్లాల వారీగా)		
సంవత్సరం	వికారాబాద్	మేడ్చల్
2023	2,123	78
2024	2,268	178
2025 (జూలై వరకు)	3,516	145
మొత్తం	7,907	409

వికారాబాద్/మేడ్చల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/పరిగి: ఇటీవల కాలంలో వికారాబాద్, మేడ్చల్ జిల్లాలో వీధి కుక్కల సంఖ్య బాగా పెరిగింది. కుక్కల నియంత్రణపై అధికారులకు పట్టింపు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం మునిసిపాలిటీల్లో ప్రత్యేకాధికారులు, కమిషనర్ల పాలన కొనసాగుతుండడంతో అధికారులు అంతగా దృష్టి కేంద్రీకరించడం లేదనేది అందరికీ తెలిసిందే. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన స్థానిక సంస్థల అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు. జిల్లాలో రోజూ ఎక్కడో చోట కుక్కల దాడిలో ఒకరిద్దరూ గాయపడుతూనే ఉన్నారు. ఇటీవల కుక్కల దాడి ఘటనలను పరిశీలిస్తే.. భయానకంగా ఉంటున్నాయి. కాళ్లు, చేతులు, మొహం రక్తమోడే విధంగా గాయాలు చేస్తున్నాయి. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో కుక్కకాటు ఘటనలు ఎక్కువగా మోమిన్‌పేట మండలంలో నమోదవుతున్నాయి.

484 కుక్కలకు శస్త్రచికిత్సలు

వికారాబాద్ జిల్లా కేంద్రంలో కుక్కల సంఖ్యను నియంత్రించేందుకు శివారెడ్డిపేట పారిశ్రామికవాడ సమీపంలో నియంత్రణ కేంద్రం ఏర్పాటు చేసినా ఫలితం లేకుండాపోయింది. మిగతా మునిసిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి. కుక్కల నియంత్రణకు

మిగతా 8వ పేజీలో...

మూడు రోజుల్లో 26 కేసులు

ఇటీవల మూడు రోజుల వ్యవధిలో రోజుల్లో వికారాబాద్ జిల్లాలో కుక్కలు 26 మందిపై దాడి చేసి గాయపరిచాయి. గత ఆదివారం ఒక్కరోజు పరిగిలో 16 మందిని, కొడంగల్‌లో 7 గురిపై కుక్కలు దాడి చేశాయి. మంగళవారం పూడూరు మండలం, మన్నేగూడలో మరో ముగ్గురిపై కుక్కలు దాడి చేశాయి. రోజుకో చోట కుక్కల కాటుకు ఎవరో ఒకరు బాధితులుగా మారుతున్నారు.



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ఎస్పీ నారాయణరెడ్డి

ఎస్పీకి నౌకాదళం నుంచి ప్రశంసా పత్రం

పూడూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ ఎస్పీ కె.నారాయణరెడ్డి భారత నౌకాదళం నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఆయన చేసిన విశేష సేవలకు గానూ నౌకాదళ ఉప అధిపతి, వైస్ అడ్మిరల్ తరుణ్ సోబ్తి శుక్రవారం పూడూరు మండలం దామగుండంలోని నౌకాదళం తాత్కాలిక కార్యాలయంలో ప్రశంసాపత్రాన్ని అందజేశారు. నారాయణరెడ్డి విధినిర్వహణలో అంకితభావం, నిబద్ధత, వృత్తి నైపుణ్యానికి ఈ గౌరవం లభించింది. భారత నౌకాదళం నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.



మాట్లాడుతున్న రవీందర్‌యాదవ్

టీబీ నిర్మూలన సాధ్యమే

» నివారణ జిల్లా అధికారి రవీందర్‌యాదవ్

బొంరాస్‌పేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలు టీబీ అంటే భయపడుతున్నారని, సరైన సమయంలో గుర్తించి చికిత్స చేయించుకుంటే నయం అవుతుందని టీబీ నివారణ జిల్లా అధికారి రవీందర్‌యాదవ్ అన్నారు. టీబీ నిర్మూలనలో భాగంగా శుక్రవారం రేగడిమైలారం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారి హేమంత్‌కుమార్, రేగడి మైలారం సబ్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ వైద్యురాలు నవ్యశ్రీ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 60 మందికి పరీక్షలు నిర్వహించగా టీబీ లక్షణాలను గుర్తించినట్లు తెలిపారు. మరో 120 మందికి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. మధుమేహం, బీపీ తదితర వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల వద్ద సమస్యలు పరిష్కరిస్తాం

» మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

కీసర రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దమ్మాయిగూడ మున్సిపల్ పరిధి అహ్మద్‌గూడలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం వద్ద సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇళ్ల సముదాయం వద్ద నెలకొన్న సమస్యల పరిష్కారానికి తీసుకోవల్సిన చర్యలపై కలెక్టరేట్‌లో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డబుల్ ఇళ్ల సముదాయం వద్ద ప్రాథమిక పాఠశాలను నెలకొల్పేందుకు కావల్సిన చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. అలాగే బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ కేంద్రాన్ని, రేషన్ దుకాణాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇళ్ల సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఇతర ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి డ్రైనేజీ సమస్య, వరద నీరు సజావుగా పారేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ హౌజింగ్ ఈఈని ఆదేశించారు. అలాగే సమీపంలో చిరు వ్యాపారులు దుకాణాలు ప్రారంభించేందుకు రుణ సదుపాయం కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, డీఈవో విజయకుమారి, డీఎంహెచ్‌వో ఉమాగౌరి, డీఎస్‌వో శ్రీనివాస్‌రెడ్డి, డీడబ్ల్యూఓ శారద, జిల్లా హౌజింగ్ అధికారి రమణమూర్తి, జీహెచ్‌ఎంసీ ఈఈ, ఆర్‌అండ్‌బీ అధికారి, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీసీఓ, తదితరులు పాల్గొన్నారు.



యూరియా తిప్పలు

యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. స్టాక్ వచ్చిందంటే చాలు ఫర్టిలైజర్ దుకాణాల వద్ద క్యూ కడుతున్నారు. శుక్రవారం ఉదయం వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలోని ఓ దుకాణం వద్ద రైతులు పెద్ద ఎత్తున క్యూలో నిలబడ్డారు. గతంలో ఆధార్ కార్డుతో యూరియా ఇచ్చే వారిని ఇప్పుడు పాస్ పుస్తకాలు జీరాక్స్ తేవాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

-వికారాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి)

24, 25న శ్రావణమాస సమాప్తి ఆరాధన

తాండూరు రూరల్ : ఆగస్టు 22, (ఆంధ్రజ్యోతి): 24, 25వ తేదీల్లో మండలంలోని అల్లాపూర్ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణమాస సమాప్తి ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు భజన మండలి ప్రతినిధులు తెలిపారు. 24వ తేదీ ఆదివారం రాత్రి 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు భజన కార్యక్రమాలు, 25వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు పల్లకీ సేవ, ఊరేగింపు, పూజా కార్యక్రమాలు సాయంత్రం 4గంటల వరకు జరుగుతాయన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



గడ్డిమోపులు, ఇసుక బస్తాలు వేసి లీకేజీ నీటిని సరిచేసిన తండావాసులు

రాంపూర్ చెరువు కట్టకు గండి

తాండూరు రూరల్: ఆగస్టు 22, (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రాంపూర్ చిన్న తండా సమీపంలోని చెరువు కట్టకు గండిపడింది. దీంతో చెరువులోని కొంత మేరకు నీరు వృథాగా పోయింది. గుర్తించిన స్థానిక రైతులు వెంటనే నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం అందజేసి మరమ్మతు పనులు చేపట్టారు. అంతా కలిసి గడ్డి మోపులు, ఇసుక బస్తాలతో గండిని పూడ్చే ప్రయత్నం చేశారు. అయిన్నప్పటికీ కొంత మేరకు నీరు వృథాగా పోయినా రైతులంతా కలిసి ముందుగా వరిగడ్డి మోపులను వేసి దానిపై ఇసుక బస్తాలు వేయడంతో నీటి లీకేజీ నిలిచింది. నీటిపారుదల శాఖ అధికారి సాయిబన్న అక్కడే ఉండి రైతులతో మరమ్మతులు చేయించడంతో కొంతమేరకు నీరు వృథా కాకుండా చూశారు. వర్షాకాలం తగ్గగానే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

తాండూరులో ఐటీఐ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్

» కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం



తాండూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం యువతలో శిక్షణ, నైపుణ్యాలను మెరుగుపరిచి ఉపాధి అవకాశాల కల్పనకు తాండూరులో ఐటీఐ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తోంది. 2025-26 విద్యా సంవత్సరానికిగాను విద్యార్థుల ప్రవేశాలు కోరుతున్నారు. ఎస్ఎస్సీ పాసైన వారికి ఒక సంవత్సరానికి గాను ఇండస్ట్రీయల్ రోబోటిక్స్, డిజిటల్, మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నిషియన్, న్యూమ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్, ఆటోమేషన్, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నిషియన్ కోర్సులు.. అలాగే రెండు సంవత్సరాలకుగాను పర్సనల్ ఎనాలసిస్, డిజైనర్, సీఎన్‌సీ మెషినింగ్ టెక్నిషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్ కోర్సులను ఈ సంవత్సరం నుంచి అమలులోకి తెస్తున్నట్లు ప్రిన్సిపాల్ సాయన్న తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఎస్ఎస్‌సీ మెమో, బోనోఫైడ్ , టీసీ, పాస్‌ఫొటో, కులధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తెలంగాణ ఉపాధి, శిక్షణ శాఖ ఈ అవకాశం కల్పిస్తుందని తెలిపారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

» అడిషనల్ డీఆర్‌డీవో నర్సింహులు



మాట్లాడుతున్న నర్సింహులు

బషీరాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని అడిషనల్ డీఆర్‌డీవో నర్సింహులు అన్నారు. శుక్రవారం బషీరాబాద్‌లోని ఐకేపీ భవనంలో నిర్వహించిన మండల మహిళ సమాఖ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో ఉల్లాస్ సర్వే, బ్యాంక్ లోన్లు, కొత్త సంఘాల ఏర్పాటు, ఐటీఐ కాలేజ్ వంటి పలు అంశలపై చర్చించారు. అనంతరం ఆయన మట్లాడుతూ మహిళల కోసం ప్రభుత్వం బ్యాంకులు, స్త్రీ నిధి, మండల సమాఖ్య ద్వారా రుణం రూపంలో ఆర్థిక సాయం చేస్తుందన్నారు. మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇందిరా మహిళా శక్తి పథకానికి రూపకల్పన చేసిందని గుర్తు చేశారు. సమావేశంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జానకి, డీపీఎం శేఖర్, ఏపీఎం శివయ్య, సీసీలు సేవ్యానాయక్, రాములు, హంపయ్య, మహిళ సంఘాల అధ్యక్షులు, సభ్యులు పలువురు పాల్గొన్నారు.



వాలీబాల్ క్రీడాకారులతో రామ్మోహన్‌రెడ్డి

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

కులకచర్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం కులకచర్ల బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయన జోనల్ స్థాయి అండర్-17, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికంగా బాలికల వసతి గృహం ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో నేవీ పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీవో భాస్కర్ గౌడ్ తన తల్లి జ్ఞాపకార్థం డ్రెస్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు, మొగులయ్య, మైపాల్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీల మౌనమేలా?

సైలెంటైన మహిళా నాయకురాళ్లు

పార్టీల కార్యక్రమాలకు దూరం!
మాజీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ తీరు
ఒకరు కాంగ్రెస్.. మరొకరు బీఆర్‌ఎస్‌లో..

తాండూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వారిద్దరు తాండూరు మున్సిపల్ తాజా మాజీ ప్రజాప్రతినిధులు. పదవీ కాలం ముగిసి ఆరు నెలలైంది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ ఇద్దరు మహిళా నాయకురాళ్లు మౌనం పాటిస్తున్నారు. వారే ఒకరు మాజీ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, మరొకరు మాజీ వైస్ చైర్‌పర్సన్ దీపా నర్సింహులు. స్వప్న పరిమళ్ పదవీ కాలం చివరిలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా, దీపా నర్సింహులు బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతున్నారు.

స్వప్న పరిమళ్ దారెటు?

ఐదేళ్లపాటు తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ హోదాలో కొనసాగిన స్వప్న పదవీ కాలం ముగిసిన తర్వాత కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. బీఆర్‌ఎస్ నుంచి చైర్‌పర్సన్ హోదాలో సీఎం సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు ఆమె. ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి మనిషిగా ముద్ర ఉన్న ఈమె ప్రస్తుతం ఆయన వెంట కూడా ఎక్కడా కనిపించడం లేదు. సామాజిక, ఆధ్యాత్మిక, హిందూ కార్యక్రమాలకు మాత్రమే హాజరవుతున్నారు. ఆధ్యాత్మిక మహిళా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. తాండూరు మున్సిపాలిటీలో

మిగతా 8వ పేజీలో...



స్వప్న పరిమళ్, మాజీ చైర్‌పర్సన్




దీపా నర్సిములు, మాజీ వైస్ చైర్‌పర్సన్

ఫాంహౌస్‌పై పోలీసుల దాడి

వ్యభిచారం నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు


మొయినాబాద్, 22ఆగస్టు(ఆంధ్రజ్యోతి): వ్యభిచారం జరుగుతుందనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఫాంహౌస్‌పై దాడులు నిర్వహించారు. ఇందులో ఓ మహిళ నలుగురు పురుషులు పట్టుబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ పీఎస్ పరిధిలోని కాశీబౌలిలో ఉన్న కృష్ణారెడ్డి ఫాంహౌస్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్ఎస్‌వోటీ పోలీసులు మొయినాబాద్ పోలీసులతోకలిసి దాడి చేశారు. పట్టుబడ్డ వారిని ప్రశ్నించగా కనకమామిడికి చెందిన శ్రీనివాస్ అలియాస్ బోండల శ్రీను తండ్రి సత్యనారయణ టిఫిన్ సెంటర్ నడుపుతున్నాడు. ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో పేదింటి అమ్మాయిలకు డబ్బుల ఆశ చూపి ఇక్కడికి తీసుకొచ్చి వ్యభిచారం చేయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అతడు గతంలోనూ పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు.











కళాశాల భవనాన్ని పూర్తి చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల రిలే నిరాహార దీక్షలు


ఆమనగల్లులో రిలే నిరాహార దీక్షలో విద్యార్థులు, నాయకులు

ఆమనగల్లు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం జూనియర్ కళాశాల ఎదుట హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిపై రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రముఖ సంఘ సేవకుడు, జేఏసీ నాయకుడు పాపిశెట్టి రాము ఎస్ఎఫ్ఐ నాయకులకు పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. భూ వివాదాన్ని పరిష్కరించి కళాశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. 2001లో ఆమనగల్లుకు జూనియర్ కళాశాల మంజూరైందని, 24 ఏళ్లుగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అసౌకర్యాల మధ్య కళాశాల కొనసాగుతుందని ఆరోపించారు. భవన నిర్మాణం గురించి అనేకసార్లు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినా, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి విన్నవించినా స్పందన లేదన్నారు. వెంటనే కళాశాల భవన నిర్మాణం చేపట్టకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, నాయకులు పూల శ్రీను, కురిమిద్ద శివ, వినోద్, కిరణ్, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.

తల్లి మృతిచెందిన వారంలోనే..

రోడ్డు ప్రమాదంలో కొడుకు దుర్మరణం

మొయినాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తల్లి మృతిచెందిన దినవారం రోజే జరిగిన రోడ్డు ప్రమాదంలో కొడుకు మృతి చెందాడు. ఈ ఘటన మొయినాబాద్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కమ్మరి వెంకటేశ్‌చారి(50) గురువారం రాత్రి బైక్‌పై కుమారునితో కలిసి కేతిరెడ్డిపల్లి నుంచి లంగర్ హౌస్ వెళ్తున్నాడు. మొయినాబాద్ సమీపంలోని తాజ్ హోటల్ వద్ద హైదరాబాద్ - బీజాపూర్ రహదారిపై వెనకాల నుంచి వేగంగా వస్తున్న క్రేన్ వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటేశ్‌చారికి తీవ్రగాయాలు కాగా, కుమారునికి సల్ప గాయాలయ్యాయి. ఇద్దరినీ ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు వెంకటేశ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.


వెంకటేశ్‌చారి (ఫైల్)

అయితే వెంకటేశ్‌చారి బండ్లగూడ సమీపంలోని కాలిమందిర్ వద్ద నివాసం ఉంటున్నాడు. ఆయన తల్లి కమ్మరి సత్తమ్మ వారం క్రితం ప్రమాదవశాత్తు నీటి కాల్వలో పడి మృతి చెందింది. గురువారం జరిగిన దినవారం కార్యక్రమానికి హాజరై తిరిగి వెళ్తున్న క్రమంలో ఈ ఘటన జరిగింది. రాత్రి ఇక్కడే ఉంటే ప్రమాదం జరిగి ఉండక పోయేదని బంధువులు పేర్కొన్నారు. వారం రోజుల్లోనే ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడం బాధాకరం. వెంకటేశ్ భార్య కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందింది. కూతురికి వివాహంకాగా కుమారుడు ఉన్నాడు. మృతుడి అన్న శేఖర్‌చారి ఫిర్యాదుతో పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన జాతీయ సదస్సు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యా సంస్థల్లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ట్రిపుల్‌ఈ) విభాగం ఆధ్వర్యంలో అత్యాధునిక విద్యుత్ వాహన సాంకేతికత కోసం క్వాంటమ్ ఆర్టీఫీషియల్ ఇంటలిజెన్స్ అప్లికేషన్స్ అనే అంశంపై మూడు రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. సాంకేతిక విద్యలో ప్రాతీయ బాషల సమన్వయాన్ని పోత్సహించడంతోపాటు భవిష్యత్తులో ఇంజినీరింగ్ ఆవిష్కరణలో సాంకేతికతలపై దృష్టి సారించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని కార్యక్రమ కన్వీనర్ వై.వీ.బలరామ కృష్ణారావు అన్నారు. ఐఐటీ, ఎన్ఐటీల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యావేత్తలు ఈ సదస్సులో పాల్గొని అభిప్రాయాలను వల్లడించారన్నారు. ఈ సదస్సులో టెక్నికరల్ సెషన్లు, ప్యానల్ చర్చలు, పేపర్ ప్రజంటేషన్లు ఇచ్చారు. కార్యక్రమంలో సదస్సు కో కన్వీనర్ ఎస్.రాజేందర్‌రెడ్డి, గురునానక్ విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ జీ.ఎస్.కోహ్లి, ఎండీ డా.హెచ్ఎస్ సైనీ, డైరెక్టర్ డా.ఎస్.శ్రీనాథరెడ్డి, జాయింట్ డైరెక్టర్ పి.పార్థసారథి, ఆర్అండ్‌డీ డీన్ డా.ఎస్.వీ.రంగనాయకులు పాల్గొన్నారు.


సదస్సులో అతిథులు, ట్రిపుల్‌ఈ విభాగం అధికారులు





అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నుంచి ఉత్సవాలు ముగిసి నిమజ్జనం అయ్యేంత వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కీసర ఆర్డీఓ వెంకటఉపేందర్‌రెడ్డి అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం మున్సిపల్, పోలీస్, విద్యుత్, మత్స్య, ఆర్అండ్‌బీ శాఖల అధికారులతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. వినాయక చవితి వేడుకల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిమజ్జనం రోజు పోలీసులు, స్థానిక మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఫిలిం సిటీ ఆక్రమణను తొలగించాలి

యాచారం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఫిలింసిటీ ఆక్రమించిన వేముల కత్వ, ఇందిరాసాగర్, పటేల్‌కుంటలలో ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి బారీ గోడ కట్టారని, నిర్మాణాలను తొలగించి ఫిలింసిటీ యాజమాన్యం కింద ఉన్న ప్రభుత్వ భూములను రక్షించాలని అబ్దుల్లాపూర్‌మెట్ సీపీఎం నాయకులు నర్సింహ, రాములు తదితరులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. 307 సర్వే నంబర్‌లో అరవై ఎకరాలుండగా, అందులో 20 ఎకరాలు ఉషోదయ ఎంటర్‌ప్రైజేస్ పేరున ఉందన్నారు. పటేల్‌కుంట ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్‌లో ఫిలింసిటీ ప్రధాన గేటు వరకు రోడ్డు వేసి ఆక్రమించారని ఆరోపించారు. 301 సర్వే నంబర్‌లోని ఆరెకరాల్లో అనాజ్‌పూర్‌లోని ఎస్సీ రైతులకు పట్టాలిచ్చారని, ఈ భూమి ఫిలింసిటీ గేటు లోపల ఉండడంతో రైతులను రాకుండా అడ్డుకుంటున్నారని, కోర్టు ఆర్డర్ అడ్డుపెట్టుకొని వారి ఆదీనంలో పెట్టుకున్నారన్నారు. 251 సర్వే నంబర్‌లో పదెకరాలు ఆక్రమించారన్నారు. ప్రభుత్వ భూములను సర్వే చేసి పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఈ విషయం ఇరిగేషన్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

శంకర్‌పల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారం అందడంలేదని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు భానుప్రసాద్ ఆరోపించారు. శంకర్‌పల్లి మండలంలోని ప్రొద్దటూరు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆయన శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో సరిపోను మరుగుదొడ్లు లేవని, ప్లేగ్రౌండ్‌లో చిన్నపాటి వర్షానికి నీళ్లు నిలుస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు సరిపోను ఉపాధ్యాయులు ఉన్నా ఎంఈవో అక్బర్ ఇష్టానుసారంగా డిప్యుటేషన్ వేశారని మండిపడ్డారు.

షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌కు గోల్డ్ మెడల్

షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుకు బంగారు పథకంతోపాటు నగదు, ప్రశంసాపత్రం అందించారు. రాజా బహదూర్ వెంకట్‌రాంరెడ్డి ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ చేతులమీదుగా బంగారు పథకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ వెంకటేశ్వర్లును అభినందించారు. తన సేవలను గుర్తించి పతకాన్ని అందించినందుకు సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి, శంషాబాద్ డీఈపీ రాజేష్, షాద్‌నగర్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

ఆదిభట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొంగ్లూర్ ఎక్స్ రోడ్డులో మాతాజీ కిరాణా జనరల్ స్టోర్‌లో విక్రయిస్తున్న గుట్కా ప్యాకెట్లను మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన బోలారం కుమావత్(43) బొంగ్లూర్ ఎక్స్ రోడ్డులో కిరాణా స్టోర్ నడుపుతూ అక్కడే ఉంటున్నాడు. అక్రమంగా గుట్కాలు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో శుక్రవారం దాడులు చేసి, విక్రయానికి సిద్ధంగా ఉంచిన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొని ఆదిభట్ల పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవి కుమార్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

డీజే పెడితే కేసులు నమోదు చేస్తాం

యాచారం/కడ్తాల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా డీజే వాడితే చట్టపరంగా చర్యలు తప్పవని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు హెచ్చరించారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మీర్‌ఖాన్‌పేటలో గణేష్ నవరాత్రోత్సవాల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అక్రమంగా విద్యుత్ కనెక్షన్ పెట్టవద్దని నిర్వాహకులకు సూచించారు. వినాయక చవితి నుంచి విగ్రహ నిమజ్జనం వరకు జాగ్రత్తగా ఉండాలన్నారు. సమావేశంలో సీఐ సత్యనారాయణ, ఎస్సైలు సైదులు, వంశీ, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

శాంతియుతంగా జరుపుకోవాలి

గణేశ్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ కోరారు. కడ్తాల మండల కేంద్రంలోని టీబీఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం గణేశ్ నవరాత్రోత్సవాల నేపథ్యంలో శాంతి సమావేశం నిర్వహించారు. వినాయక మండపాల ఏర్పాటు, అనుమతి, మండపాల నిర్వాహణ, ఉత్సవాల ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. గణేశ్ నవరాత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలన్నారు. సీఐ గంగాధర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎస్ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, విద్యుత్ శాఖ ఏఈ నరేందర్, ఇరిగేషన్ శాఖ ఏఈ మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఏటీసీ నమూనాను పరిశీలిస్తున్న అధికారులు

రూ.7 కోట్లతో ఏటీసీ నిర్మాణం

దుద్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలోని హకీంపేట్‌కు మంజూరైన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) నిర్మాణానికి అధికారులు శుక్రవారం తుది నమూనాను ఖరారు చేశారు. గ్రామ శివారులోని సర్వే నం.252లో ఎకరా స్థలాన్ని కేటాయించడంతో గత నెలలో టీజీఐఐసీ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఏటీసీ నిర్మాణానికి తుది నమూనాను ఇచ్చేందుకు సంబంధిత అధికారులు మరోమారు సందర్శించారు. రూ.7 కోట్లతో త్వరలోనే నిర్మాణం చేపట్టనున్నట్లు టీజీఐఐసీ డీఈ శేషారావు తెలిపారు. కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఏఈ సురేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, చాకలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులపై బెంగతో..
పాఠశాల భవనం నుంచి దూకిన బాలిక

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లపటేల్ గూడ దగ్గర ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల పాఠశాలలో చదివే ఆరో తరగతి విద్యార్థిని పాఠశాల భవనం పైనుంచి దూకడంతో కాలికి గాయమై ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళితే ఖైరతాబాద్‌కు చెందిన మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల పాఠశాల చెర్లపటేల్‌గూడలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో కొనసాగుతోంది. ఈ పాఠశాలలో గద్వాలకు చెందిన మీనాక్షి(11) ఈ నెల 5న ఆరో తరగతిలో చేరింది. అమ్మానాన్నలపై బెంగతో, ఇక్కడ చదవడం ఇష్టం లేకనో శుక్రవారం మధ్యాహ్నం పాఠశాల భవనం రెండో అంతస్తు నుంచి దూకడంతో ఓ చెట్టు అడ్డు తగిలి కిందకు పడిపోయింది. దీంతో కాలికి గాయం కావడంతో ఆ బాలికను ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. తరువాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాలిక కాలికి గాయమైందని, ఎలాంటి ప్రమాదం లేదని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

కాలుష్యం బారి నుంచి కాపాడండి

షాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందన్‌వెళ్లి పారిశ్రామిక హబ్‌గా మారుతుందని అంతా సంతోషపడ్డారు. పరిశ్రమలతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనుకున్నారు. కానీ, వాయు కాలుష్యంతో ముప్పు తిప్పలు పడుతున్నారు. కుందన్ టెక్స్ టైల్స్ కంపెనీ వల్ల వాయు కాల్యుష్యం ఎక్కువగా అవుతుందని చందన్‌వెళ్లి గ్రామస్తులు శుక్రవారం కంపెనీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ మాట్లాడుతూ.. కుందన్ టెక్స్ టైల్స్ పరిశ్రమ నుంచి వెలువడే వాయు కాలుష్యంతో పిల్లలు, వృద్ధులు శ్వాసకోస సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కంపెనీ నుంచి వస్తున్న కాలుష్యంతో దుర్వాసన వస్తోందని, పరిసరాల్లో నీటిని పశువులు కూడా తాగడం లేదన్నారు. కాలుష్యం కారణంగా పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని ఆరోపించారు. ఇంత జరుగుతున్న పీసీబీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాలుష్య కోరల నుంచి గ్రామస్తులకు విముక్తి కల్పించాలని, కంపెనీపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు వెంటేష్, మల్లేష్, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి

కేశంపేట, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సంతాపూర్ అటవీ ప్రాంతంలో స్వయంభుగా వెలిసిన పానకాల లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సమీప గ్రామ ప్రజలు ప్రతి సంవత్సరం స్వామి వారికి పూజలు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలందరిపై స్వామి కృప ఉండాలన్నారు. కార్యక్రమంలో సంతాపూర్, పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్ రెడ్డి, తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు యారంశేఖర్ రెడ్డి, నాగిళ్ల వెంకటేష్, సాజీద్, నరేందర్ రెడ్డి, జగన్ రెడ్డి, యాదయ్య గౌడ్, రజినీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

కేశంపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు నిర్వహించుకోవాలని, వేడుకల వేళ డీజేలకు అనుమతి లేదని కేశంపేట సీఐ నరహరి సూచించారు. మండల కేంద్రంలోని బీఎస్‌వై గార్డెన్‌లో శుక్రవారం శాంతి సమావేశం నిర్వహించారు. గ్రామాలలో గణేశ్ మండపాలు ఏర్పాటు చేసుకునే వారు అనుమతి తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ ఆజంఅలీ, ఇన్‌చార్జీ ఎంపీడీవో కిష్టయ్య, ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఏఈ సాయి, ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గోతులు తీయొద్దు

షాద్‌నగర్ : గణేష్ మండపాల ఏర్పాటు కోసం రోడ్లపై గుంతలు తీస్తే చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ సునీత హెచ్చరించారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మండపాల ఏర్పాటు కోసం రోడ్లపై గుంతలు తీయడం, రోడ్డుకు అడ్డంగా వినాయకులను పెట్టడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఆకాశంలో అద్భుతం
సూర్యుడి చుట్టూ వలయాకారం

రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ గ్రామంలో అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమైంది. శుక్రవారం ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు సూర్యుడి చుట్టూ వలయాకారం ఏర్పడింది. ఈ అద్భుత దృశ్యం అందరినీ ఆకర్షించింది. కొందరు యువకులు తమ ఫోన్‌లలో బంధించారు.

- యాచారం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి)

గ్రామీణ బ్యాంకులో ఇంటి దొంగలు

- ఫిక్స్‌డ్ చేసిన మహిళకు తెలియకుండా డబ్బులు డ్రా
- ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై కేసులు



తాండూరు,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ తాండూరు తెలంగాణ గ్రామీణ బ్యాంకులో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఖాతాదారురాలు ఫిక్స్ డిపాజిట్ చేసిన డబ్బులను వారికి తెలియకుండా ఫోర్జరీ చేసి డ్రా చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే తాండూరుకు చెందిన విశాలక్షి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రూ.6లక్షల విలువ చేసే రెండు ఫిక్స్ డిపాజిట్‌లను 1994లో చేసింది. అయితే ఆమెకు తెలియకుండా బ్యాంకులో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ప్రేమ్‌సింగ్ ఫోర్జరీ సంతకంతో డబ్బులు విత్ డ్రా చేసుకున్నాడు. గతంలో ఫిక్స్‌డ్ చేసిన డబ్బుల కాలపరిమితి ముగియడంతో విత్ డ్రా చేసుకునేందుకు బ్యాంకుకు వచ్చిన విశాలాక్షికి తను డబ్బులు ఎవరో ఫోర్జరీ చేసి విత్ డ్రా చేశారని తెలువడంతో మేనేజర్ శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ప్రధాన నిందితుడిగా ప్రేమ్‌సింగ్‌ను గుర్తించి ఆయనపై కేసు నమోదు చేశారు. ఇంకా ఔట్ సోర్సింగ్ సిబ్బంది కొంత మంది ప్రమేయం ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని విచారణ చేసి వారిపై కూడా కేసు నమోదు చేస్తామని సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. 1994లో బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసిన ఖాతాలను అప్పట్లో కంప్యూటీకరణ చేయలేదు. మ్యాన్యువల్ పత్రాలను ఖాతాదారులకు అందజేశారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



మొయినాబాద్ రూరల్: చిన్నమంగళారంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్ రూరల్/శంకర్‌పల్లి/షాబాద్/చేవెళ్ల, ఆగస్టు22(ఆంధ్యజ్యోతి): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. పల్లెల్లో పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని చిన్నమంగళారంలో రూ.12 లక్షలతో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ సంధ్య, షాబాద్ దర్శన్, హన్మంత్ యాదవ్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

శంకర్‌పల్లి మండలంలోని మహాలింగపురం గ్రామంలో ఉపాధిహామీ నిధులతో నిర్మించిన కోళ్ల ఫామ్ షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ చంద్రమోహన్, మండల ప్రత్యేకాధికారి సురేష్‌బాబు, తహసీల్దార్ సురేందర్, ఇన్‌చార్జి ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంపీవో గిరిరాజ్, ఏపీవో నాగభూషణం, పంచాయతీ రాజ్ ఏఈ నందకిషోర్, తదితరులు ఉన్నారు. అలాగే షాబాద్ మండల పరిధిలోని ఆస్పల్లిగూడలో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డును జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. మండల పరిధిలో రూ.18 కోట్ల 60 లక్షలతో బీటీ రోడ్లు మంజూరయ్యాయన్నారు. ఆయన వెంట గుడిమల్కాపూర్ ఏఎంసీ వైస్‌చైర్మన్ కావలి చంద్రశేఖర్, చేవెళ్ల ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని హస్తేపూర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి ఎమ్మెల్యే యాదయ్య శంకుస్థాపన చేశారు. ఆయన వెంట రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాయల సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం రుణమాఫీ చేయదు..
ఎమ్మెల్యే పట్టించుకోడు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ తీరుతో, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి అసమర్థతతో నియోజకవర్గ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆరోపించాడు. శుక్రవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు పంట రుణ మాఫీ చేస్తామని చెప్పి అధికారం చేపట్టి 20 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ నియోజకవర్గంలోని 50శాతం మంది రైతులకు రుణ మాఫీ చేయలేదన్నారు. ఒక్క ఘట్‌కేసర్ సహకార సంఘంలోనే 1,189 మంది రైతులకు నేటికీ రుణమాఫీ జరుగలేదన్నారు. ఇక్కడి రైతులకు రూ.8 కోట్ల 88లక్షలను ఆడిట్ పేరుతో ఎగనామం పెట్టారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అరచేతిలో వైకుంఠం చూపిస్తోందని వ్యాఖ్యానించారు. రుణమాఫీపై ఎదులాబాద్‌లో రైతులతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనా దక్షతతో 20 నెలల్లో రాష్ట్రం అద్భుత ప్రగతి సాధించిందని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి పర్యటించారు. తలకొండపల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు ఎల్‌వోసీ, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సుకు పాటుపడుతున్న ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గం ప్రగతిలో దూసుకుపోతుందన్నారు. ఆమనగల్లు, కల్వకుర్తి మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చి దిద్దుతామని తెలిపారు. నియోకవర్గంలో రూ.వెయ్యి కోట్లతో రోడ్లను అభివృద్ధికి కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, నాయకులు తావుర్యనాయక్, విజయ్‌నాయక్, బీష్మాచారి, సురేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, విజయ్‌రాథోడ్, జగన్, తాళ్ల రవీందర్, సూదిని కొండల్ రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలు

- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



పెద్దేముల్: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్/యాలాల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అవసరమైన అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలు నిర్మిస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలం బండపల్లి, ఇందూరు, సిద్దన్నమడుగుతండాల్లో అంగన్‌వాడీ కేంద్రం, గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలు నిర్మించేందుకు నియోజకవర్గానికి రూ.8 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఉపాధిహామీ ద్వారా పశువుల షెడ్లు, ఇంకుడుగుంతలు, కంపోస్ట్ షెడ్లు, కోళ్లఫారాలు, మేకలషెడ్లు మంజూరైన వారికి మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో టాటా కన్సల్టెన్సీ అడ్వాన్స్ ట్రైనింగ్‌సెంటర్(ఏటీసీ) మంజూరైందని, ఇందులో అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి దారాసింగ్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఏఎంసీ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయనరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్, నాయకులు మహిపాల్‌రెడ్డి, నరేందర్, ప్రకాష్, శోభారాణి, ఉప్పరి మల్లేశం పాల్గొన్నారు. అలాగే యాలాల మండలం జుంటుపల్లి, పగిడిపల్లి గ్రామాల్లో గ్రామ పంచాయతీ, ముకుందాపూర్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కో-ఆపరేటివ్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు సంగెంకుర్దు హన్మంతు, అక్బర్‌బాబా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా నిధుల స్వాహాపై విచారణ ముమ్మరం

- పాత ఏపీఎంలకు షోకాజ్ నోటీసులు జారీ



విచారణ చేస్తున్న డీపీఎంలు యాదయ్య, లలిత

యాచారం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌదర్‌పల్లిలో డ్వాక్రా పొదుపు సంఘాల్లో ఫోర్జరీ సంతకాలతో నిధులు డ్రా చేసిన ఘటనపై డీఆర్‌డీఏ ఉన్నతాధికారులు విచారణ ముమ్మరం చేశారు. ఇద్దరు డీపీఎంలు యాదయ్య, లలిత, ఆడిటర్లు శ్రీనివాస్, మధు పొదుపు సంఘాల రికార్డులను పరిశీలిస్తున్నారు. ఏయే నెలలో సంఘాలు ఎంత మేర అప్పులు చెల్లించారు, బకాయిలు ఎంత చెల్లించారు, బ్యాంక్‌లో రుణంతోపాటు పొదుపు డబ్బు జమ చేసిన రసీదులను పరిశీలిస్తున్నారు. నిబంధనల మేరకు నిధులు డ్రా చేశారా, లేదా అనే కోణంలో విచారణ చేస్తున్నామని డీఆర్‌డీఏ డీపీఎంలు యాదయ్య, లలిత తెలిపారు. సూక్ష్మ జీవనోపాధి ప్రణాళిక యాప్‌లో రుణం తీసుకునేందుకు అప్‌లోడ్ చేశారా, లేదా? అని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నేళ్ల నుంచి ఈ తతంగం జరుగుతుందని ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే నిధుల స్వాహాపై అధికారులు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఏపీఎంల పాత్ర ఉందా, లేదా? అని తెలుసుకునేందుకు అధికారులు విచారిస్తున్నారు. ఈ మేరకు పాత ఏపీఎంలైన సాంబశివుడు, సుదర్శన్‌రెడ్డి, సీసీ జంగయ్యలకు షోకాజ్ నోటీసలు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా బుక్‌కీపర్లను విధుల నుంచి తొలగించే అంశంపై యోచిస్తున్నట్లు తెలిసింది.

దోషులపై చర్యలు తీసుకుంటాం

పొదుపు సంఘాల్లో ఫోర్జరీ సంతకాలతో స్వాహా అయిన డబ్బును రికవరీ చేసి మహిళలను ఆదుకుంటామని ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ సంజయ్‌కుమార్ డ్వాక్రా సంఘాల మహిళలకు హామీ ఇచ్చారు. నిధుల స్వాహాపై సమగ్రంగా విచారణ చేస్తున్నామని తెలిపారు. ఈ ఘటనతో బ్యాంకుకు చెడ్డపేరు వచ్చిందని, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయనవెంట బ్యాంక్ మేనేజర్ మాన్యానాయక్, సీఐ నందీశ్వర్‌రెడ్డి ఉన్నారు.



బినామీ ఉపాధ్యాయురాలిని నిలదీస్తున్న అధికారులు

ప్రభుత్వ పాఠశాలలో బినామీ ఉపాధ్యాయురాలి పాఠాలు

- విధులకు గైర్హాజరైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. అధికారుల తనిఖీతో వెలుగులోకి..

బొంరాస్‌పేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు విధులకు గైర్హాజరై, తన స్థానంలో బినామీ టీచర్‌తో తరగతులు నిర్వహిస్తున్న ఘటన వికారాబాద్ జిల్లాలో అధికారుల తనిఖీల్లో బయటపడింది. బొంరాస్‌పేట్ మండలం గాజులకుంట ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు విధుల్లో లేకపోవడంతో.. విద్యార్థులను అడగ్గా అసలు విషయం బయటపడింది. అదే గ్రామానికి చెందిన ఓ ప్రైవేట్ ఉపాధ్యాయురాలితో ప్రతిరోజూ పాఠాలు చెప్పిస్తూ.. ఆ ఉపాధ్యాయుడు తన వ్యక్తిగత పనులకు వెళ్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. దీంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆయనపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ విషయంపై సదరు ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకటేశ్‌ను వివరణ కోరగా.. అప్పటి వరకు పాఠశాలలోనే ఉన్నానని, శాఖాపరమైన పనుల నిమిత్తం మండల విద్యా కార్యాలయానికి వచ్చిన సమయంలోనే అధికారులు తనిఖీకి వచ్చినట్లు సమాధానం ఇచ్చాడు.

కల్వర్టు విస్తరణ పనులు చేపట్టాలి

ఆదిభట్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మంగల్‌పల్లి-సాహెబ్‌గూడ మధ్యలో పిరంగి కాల్వపై ఉన్న కల్వర్టు విస్తరణ పనులు చేపట్టాలని సీపీఎం మున్సిపల్ కన్వీనర్ తులసిగారి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో కల్వర్టు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పిరంగి కాల్వపై గతంలో నిర్మించిన కల్వర్టు పూర్తిగా పాడై ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. రోడ్డు విస్తరణ జరిగినప్పటికీ కల్వర్టు విస్తరణ మాత్రం జరగలేదన్నారు. కలెక్టరేట్ కొంగరకలాన్‌లో ఉండడంతో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల ప్రజలు ఈరోడ్డు మీదుగానే రాకపోకలు జరుపుతుంటారని, కల్వర్టుపై గుంతలు ఏర్పడడంతో రాత్రి సమయంలో కనబడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. గతంలో ఓ కారు అదుపు తప్పి కాల్వలో పడిపోవడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందినట్లు గుర్తుచేశారు. అధికారులు కల్వర్టు విస్తరణ చేపట్టి, గుంతలు పడిన రోడ్లుకు మరమ్మతులు చేయాలని కోరారు. నాయకులు జంగయ్య, బుగ్గరాములు, నరసింహ, జగన్, రంజిత్‌కుమార్, బిక్షపతి, ప్రభుదాస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు గౌరవప్రదంగా మెలగాలి



మాట్లాడుతున్న ఎంఈవో మల్లయ్య

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 22(ఆంధ్యజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదని, ఆ పదవికి మచ్చ తెచ్చేలా వ్యహరించకూడదని మండల విద్యాధికారి మల్లయ్య సూచించారు. విద్యార్థులను భవిష్యత్తులో మంచి స్థాయిలో స్థిరపడేలా కృషి చేయాలన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మహ్మద్ హిమన్షహ గురువారం మద్యం తాగి పాఠశాలకు వచ్చిన తీరుపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. శుక్రవారం పాఠశాలకు వెళ్లి గ్రామస్థులతో కలిసి సదరు ఉపాధ్యాయుడితో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మరోసారి మద్యం సేవించి పాఠశాలకు వస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు హెచ్చరించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఇలా వ్యవహరించడం సరికాదని కుటుంబ సభ్యులకు సూచించారు. కాగా, మళ్లీ తాను మద్యం సేవించి పాఠశాలకు వస్తే తనపై చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి మల్లయ్యకు మహ్మద్ హిమన్షహ లిఖితపూర్వకంగా లేఖను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ముదిగొండ రవియాదవ్, పలు యువజన సంఘాలకు చెందిన సభ్యులు ఉపాధ్యాయుడిని మందలించారు. మళ్లీ ఇలా వ్యవహరిస్తే భవిష్యత్తులో తీవ్రపరిణామలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

యురియా కొరతతో రైతుల ఇబ్బందులు

కందుకూరు/కొందుర్గు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): యురియా బస్తాల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో సాగుచేసిన వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయల పంటలకు కావాల్సిన్ని యురియా బస్తాలను రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో అందించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. 500 టన్నుల యురియా కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 120 టన్నులు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేసింది. శుక్రవారం కేవలం 420బస్తాల యురియాను మండల కేంద్రానికి తరలించారు. దాంతో పలు గ్రామాల రైతులు యురియా కోసం మండల సహకార సంఘం కార్యాలయం వద్ద క్యూలో ఉన్నా.. సరిపడా యురియా బస్తాలు ఇవ్వలేవదని వాపోయారు. ప్రభుత్వం సరిపడా యురియా బస్తాలను సరఫరా చేయాలని, లేనిపక్షంలో ఉద్యమం చేపడతామని అన్నారు. కొందుర్గు మండల పరిధిలోని సింగిల్ విండో, రైతు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో మండల వ్యవసాయాధికారి సురేష్ రెడ్డి సమక్షంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు.

రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి గొప్ప సంఘ సంస్కర్త

షాద్‌నగర్ అర్బన్/కొందుర్గు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజిక మార్పు వచ్చి, పేదలు ఆర్థికంగా ఎదుగుతారని గ్రహించి, విద్యా సంస్థలను నెలకొల్పి కులమతాలకతీతంగా చదువుకునే అవకాశం కల్పించిన గొప్ప సంఘ సంస్కర్త రాజా బహదూర్ వెంకట్‌రాంరెడ్డి అని షాద్‌నగర్ రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు కొప్పుల మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వెంకట్‌రాంరెడ్డి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక రెడ్డి భవన్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రెడ్డి సేవా సమితి నాయకులు గుర్రం రవీందర్‌రెడ్డి, ఎం.నర్సింహారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, బి.హరీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొందుర్గు మండలం రాంచంద్రాపూర్‌లో వెంకట్‌రాంరెడ్డి జయంతిని రెడ్డి సంఘం సభ్యులు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బల్వంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, గణేష్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూన్ సెషన్‌లో ప్రతిభ కనబర్చాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద గౌడ్

మేడ్చల్ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) ఐక్యరాజ్య సమితి నిర్వహించే మూన్ సేషన్‌లలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చటాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని డీఆర్ఎస్ ఇంటర్‌నేషన్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మూన్ నేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్ఎస్ డైరెక్టర్ అంజనీకుమార్ అగర్వాల్, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, మూన్ అధ్యక్షురాలు మేరీ తనూజ పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌ను కలిసిన కమిషనర్



సబ్ కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న యాదగిరి

తాండూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న యాదగిరి శుక్రవారం తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సబ్‌కలెక్టర్‌కు మొక్కను అందజేశారు.

'మొలక' మాస పత్రిక ఆవిష్కరణ



మాసపత్రికను ఆవిష్కరిస్తున్న అతిథులు

కొడంగల్ రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వేదాంత సూరి ఎడిటర్ ఆధ్వర్యంలో వస్తున్న బాలల మాసపత్రిక మొలక ఆగస్టు మాస పుస్తకాన్ని హస్నాబాద్ మాజీ సైనికుల చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. హస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాండూర్ శ్రీరామకృష్ణ సేవ సమితి అధ్యక్షులు బాలకృష్ణ రిటైర్డ్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మొలక పత్రిక స్పెషల్ కరస్పాండెంట్ కెవీఎం వెంకట్, జీహెచ్ఎం నర్సింలు, రిటైర్డ్ హెడ్మాస్టర్ లక్ష్మీనర్సయ్య, రిటైర్డ్ ఆర్మీ జవాన్‌లు హన్మయ్య పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మోతె వెంకట్‌రెడ్డి

కీసర, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర కోశాధికారి మోతె వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. కీసరలో శుక్రవారం టీయూడబ్ల్యూజే మేడ్చల్ మాల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాల్‌రాజ్ అధ్యక్షతన జిల్లా విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం హెల్త్‌కార్డులను పునరుద్ధరించాలన్నారు. అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో కార్డులు చెల్లుబాటు అయ్యేవిధంగా చూడాలన్నారు. కొత్త అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలన్నారు. సెప్టెంబరు 5వ తేదీ వరకు మండలాల వారిగా నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, మండల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

హకీంపేట్ జీహెచ్‌ఎంగా శంకర్



శంకర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దుద్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): హకీంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీహెచ్ఎంగా శంకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొందుర్గు మండలం తుమ్మలపల్లి పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ జీహెచ్ఎంగా ఉద్యోగోన్నతిపై హకీంపేట్‌కు వచ్చారు. ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, కరుణాకర్ పాల్గొన్నారు.

శునకం.. భయానకం!

(ఐదో పేజీ తరువాయి)

మునిసిపాలిటీలు, పంచాయతీల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఉన్నా అమలుకు నోచుకోవడం లేదు. నియంత్రణ చర్యల పేరిట నిధులు పక్కదారి పడుతున్నాయే తప్ప కుక్కల సంఖ్యను నియంత్రించలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే, కుక్కలసంఖ్యను నియంత్రణకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఇప్పటి వరకు 484 శస్త్ర చికిత్సలు చేశారు.

తస్మాత్ జాగ్రత్త...

కుక్కలసంతతి ఉత్పత్తి అధికంగా జరిగే జూలై నుంచి డిసెంబరు వరకు జాగ్రత్తగా ఉండాలని పశు వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గర్భందాల్చిన కుక్కలు ఎక్కువ కోపంతో ఉంటాయని, ఇలాంటి కుక్కలు తమను తరిమే ప్రయత్నం చేసేవారిపై దాడి చేస్తూ గాయపరుస్తుంటాయని తెలిపారు. కుక్కల కళ్లలోకి నేరుగా చూడకూడదని, అలాచేస్తే అవి రెచ్చగొట్టినట్లుగా భావిస్తాయని, పెంపుడు కుక్కలు కూడా కొన్ని సందర్భాల్లో ఇలాగే ప్రవర్తిస్తాయన్నారు. కుక్కలు తినే సమయంలో కదలించకూడదని, నోటి నుంచి లాలాజలం వస్తుంటే అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జాగ్రత్తలు తీసుకుంటేనే...

ప్రజలు నడుచుకుంటూ వెళ్లేప్పుడు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రజలు కుక్కలపై రాళ్లు వేయొద్దని, కర్రలతో కొట్టే ప్రయత్నం చేస్తే భయాందోళనకు గురై కుక్కలు ఎదురు దాడిచేసి గాయపరుస్తాయని చెబుతున్నారు. వేగంగా తరుముకొచ్చే వీధి కుక్కల విషయంలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకుంటేనే కుక్కకాటు బారిన పడకుండా బయట పడవచ్చని సూచిస్తున్నారు. కుక్క కరిచిన వెంటనే గాయమైన చోట నీటి ధారలో సబ్బుతో శుభ్రపరుచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వైద్యుల సూచనల మేరకు వెంటనే టీకాలు తీసుకోవాలన్నారు. గాయం కాగానే వస్త్రం చుడితే రేబిస్ వ్యాధి బారిన పడి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు.

అందుబాటులో లేని రేబిస్ వ్యాక్సిన్

పరిగిలో ఆదివారం కుక్కల దాడిలో గాయపడిన వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో లేక కొడంగల్‌కు పంపించారు. అక్కడ కూడా లేకపోవడంతో తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉంటే, ప్రభుత్వాసుపత్రుల్లో కుక్క కాటు నివారణ వ్యాక్సీన్ అందుబాటులో ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి తెలిపారు. ప్రస్తుతం 6,918 డోసుల రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు.



పరిగిలో కుక్కల సంచారం

నివారణకు చర్యలు తీసుకోవాలి



పరిగి పట్టణంలో వీధి కుక్కల నిర్మూలనకు మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి. వీధుల్లో గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. బయటకు రావాలంటేనే భయమేస్తుంది. పిల్లలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. పరిగిలో కుక్కలను నిర్మూలించాలి.

- బసిరెడ్డి, టీచర్స్‌కాలనీ వాసి, పరిగి

దశల వారీగా చర్యలు



పరిగిలో 470 కుక్కలను గుర్తించాం. వీటిలో 182 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారు. మిగతావాటికి దశలవారీగా చర్యలు తీసుకుంటాం. ప్రజలకు కుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలి. కుక్కల బారి నుంచి ఇబ్బంతులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

- వెంకటయ్య, మునిసిపల్ కమిషనర్, పరిగి

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



పూడూరు: ఎన్కెపల్లిలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సంధ్యారాణి

పూడూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని డీఎల్‌పీవో సంధ్యారాణి అన్నారు. ఎన్కెపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను శుక్రవారం డీఎల్‌పీవో పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు.

ఘట్‌కేసర్ రూరల్: ప్రతాప్ సింగారంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుదీర్‌రెడ్డి పట్టాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దశలవారీగా పేదల సొంతింటి కలను నేరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అబేద బేగం, బద్దం ప్రభాకర్, ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

చౌడాపూర్: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ శుక్రవారం ప్రొసీడింగ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, నాయకులు గోపాల్, చెన్నయ్య, యాదయ్య, రాములు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుడి పల్లకీసేవ



పల్లకీసేవలో సేవా సమితి సభ్యులు, నాయకులు

ఘట్‌కేసర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఘట్‌కేసర్‌లోని బాలాజీనగర్‌లో ద్వైత సిద్దాంత ప్రబోధ సేవాసమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని, మల్లేష్, దేవేందర్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



కొడంగల్‌లో అరెస్టయిన బీజేపీ నాయకులు

దోమ/దుద్యాల/కొడంగల్/కులకచర్ల/ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ పరిధిలో సమస్యలు పరిష్కరించాలని 'సేవ్ హైదరాబాద్' పేరుతో బీజేపీ తలపెట్టిన సెక్రటరీయేట్ ముట్టడికి సిద్ధమైన బీజేపీ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. దోమలో బీజేపీ మండల అధ్యక్షుడు బొంగు మల్లేశంను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. దుద్యాల మండలంలో ఓబీసీ మోర్చా నాయకులు శ్రీకాంత్, బలరాంయాదవ్, కలిగే రాములు తదితరులను అరెస్టు చేశారు. కొడంగల్ మండల బీజేపీ నాయకులను ముందస్తుగా శుక్రవారం అరెస్టు చేశారు. ఎలాంటి సమాచారం లేకుండానే ఈ అరెస్టులు సరైనవని నాయకులు ఆరోపించారు. అరెస్టయిన వారిలో బీజేపీ నాయకులు సర్వేశ్, కరాటే శ్రీను, ప్రవీణ్, సాయి కుమార్, అనిల్‌కుమార్, అరుణ్ ఉన్నారు. కులకచర్లలో బీజేపీ నాయకులు అంజిలయ్య, షైపాల్, చంద్రలింగం, జానకిరామ్, గోపాల్ తదితరులు అరెస్టయిన వారిలో ఉన్నారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. అదేవిధంగా ఘట్‌కేసర్‌లో బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు.

చెత్త ట్రాక్టర్ డ్రైవర్‌కు బెదిరింపు

● పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

ధారూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గట్టేపల్లిలో చెత్త తొలగించటానికి ట్రాక్టర్ తీసుకెళ్లొద్దని ట్రాక్టర్ డ్రైవర్‌ను బెదిరించిన పంచాయతీ కార్యదర్శి అశోక్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, ఎంపీలకు ఫిర్యాదు చేసినట్లు మాజీ ఎంపీటీసీ రమేశ్ కృష్ణ తెలిపారు. గట్టేపల్లి పంచాయతీ కార్యదర్శి విధులను నుంచి తప్పించిన అశోక్ చెత్త ట్రాక్టర్‌ను నడపవద్దని డ్రైవర్‌ను ఎలా ఆదేశిస్తారని ఆయన ప్రశ్నించారు. గ్రామంలో చెత్త పేరుకుపోయిందని తాము కోరితే చెత్తపేరుకుపోయినా పర్వాలేదనడమేంటని ప్రశ్నించారు. ఈ మేరకు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. గ్రామంలో గడ్డిమందు పిచికారి చేయించి బిల్లు డ్రా చేయాలని కార్యదర్శి ప్రయత్నిస్తున్నాడని ఎంపీడీవో, ఎంపీవో దృష్టికి తెచ్చినట్లు ఆయన చెప్పారు.

మాజీల మౌనమేలా?

(ఐదో పేజీ తరువాయి)

మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ, మహిళా ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలను నిర్వహించగా అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన తాజా మాజీ మహిళా కౌన్సిలర్లు హాజరయ్యారు. కానీ, స్వప్న హాజరు కాలేదు. మూడు నెలలుగా సైలెంట్‌గా ఉండడం వెనుక అర్థం ఏమిటోనని అధికార పార్టీలో అంతర్గతంగా చర్చ జరుగుతోంది. ఇటీవల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రొఫెషనల్ మీట్ కార్యక్రమంలో ప్రధాని మోదీని పొగిడి చర్చనీయమయ్యారు. అప్పట్లో స్వప్న బీజేపీలో చేరుతున్నారని విస్తృతంగా ప్రచారం జరిగింది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలో నిలబడతారా, నిలబడితే ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారన్నది ప్రశ్న. ఏది ఏమైనా సైలెంట్ పొలిటికల్ గేమ్‌పై ఏదో దాగి ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

దీపా వ్యూహమేమిటో!

అదేవిధంగా మాజీ వైస్ చైర్‌పర్సన్ దీపా నర్సింహులు వ్యూహమేమిటోనని బీఆర్ఎస్‌లో చర్చ జరుగుతోంది. ఐదేళ్లపాటు మున్సిపాలిటీలో వైస్ చైర్‌పర్సన్‌గా కొనసాగిన ఈమె పదవీ కాలం ముగిసిన తర్వాత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ప్రతిపక్ష పాత్ర పోషించకుండా ఎందుకు ఇలా చేస్తున్నారో తెలయిడం లేదని తాజా మాజీ కౌన్సిలర్లు వాపోతున్నారు. అవిశ్వాస తీర్మానం, సమయాల్లోనూ దీపాకు అండగా నిలిచామని, అధికారం కోల్పోయాక ఎవర్నీ పట్టించుకోక పోవడమేమిటని తాజా మాజీ కౌన్సిలర్లు గుసగుసలాడుతున్నారు. అసలు మౌనం ఎందుకు వహిస్తున్నారో అర్థం కావడం లేదని తాజా మాజీ కౌన్సిలర్ ఒకరు దీపాను ఉద్దేశించి ఇటీవల వ్యాఖ్యనించారు. 20 మంది కౌన్సిలర్లకు నాయకత్వం వహించిన ఆమె బీఆర్ఎస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. అధికార పార్టీ, బల్దియా అక్రమాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఆమె ప్రస్తుతం ప్రజా క్షేత్రంలోకి రాకపోవడానికి కారణమేమిటి, రాజకీయలకు దూరమవుతున్నారా? అన్న ప్రశ్న వినిపిస్తోంది. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటంటూ పలువురు నాయకులు, తాజా మాజీ కౌన్సిలర్లు వాపోతున్నారు. ప్రస్తుతం పది మంది తాజా మాజీ కౌన్సిలర్ల బలం ఉన్నందున మున్సిపాలిటీలో ప్రజా వ్యతిరేక విధానాలు, సమస్యలపై పోరాడేందుకు ముందుకు రావాలని కోరుతున్నారు. వచ్చే ఎన్నికల్లో నిలబడతారా? దూరంగా ఉంటారా? అనేది తేలాల్సి ఉంది. పోటీ చేసే వారైయితే ప్రతిపక్ష నాయకురాలిగా పోరాడే వారని బీఆర్ఎస్‌లో చర్చ కొనసాగుతోంది. ఆమె భర్త పట్లోళ్ల నర్సింహులు మాత్రం బీఆర్ఎస్ కార్యక్రమాలకు హాజరవుతున్నారు.

క్రైం కార్నర్

చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం

మూడుచింతలపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట్ చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని నెల్లూరు జిల్లా తమ్మిదపాడుకు చెందిన చెరుకూరి రసూల్(25)కుటుంబసభ్యులతో కలిసి మైసమ్మగూడలో నివాసముంటూ ప్రైవేట్ పనిచేస్తున్నాడు. రెండురోజుల కిందట ఇంటి నుంచి వచ్చిన రసూల్ శామీర్‌పేట్ చెరువులో విగతజీవిగా కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చెరుకుని మృతదేహాన్ని బయటకి తీసి శవపంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అచ్యుతాపూర్‌లో చోరీ

యాలాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపూర్‌లో శుక్రవారం ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గొల్ల శివయ్య శుక్రవారం ఉదయం ఇంటికి తాళంవేసి కుటుంబసభ్యులతో సహా పని నిమిత్తం పొలానికి వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండటం చూశాడు. ఇంట్లోకి వెళ్లగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలో వరుస దొంగతనం జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

30 మేకలు అపహరణ

కులకచర్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తులు 30మేకలు అపహరించారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. బండవెల్కిచర్లకు చెందిన బాలయ్య రోజూ మాదిరిగా గురువారం పొలం దగ్గర మేకలను కట్టేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున వెళ్లి చూడగా మేకలు కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన బాలయ్య కులకచర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అక్రమ మైనింగ్ కేసులో విచారణ

దోమ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమ మైనింగ్ కేసులో దోమ మాజీ జడ్పీటీసీ నాగిరెడ్డిని పోలీసు కస్టడీలో భాగంగా శుక్రవారం దోమ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో విచారించారు. దిర్సంపల్లిలోని సర్వే నంబర్ 173లో లీజు అనుమతులకు మించి అక్రమ మైనింగ్ చేయడంతో రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదైన విషయం విదితమే. ఈ ఘటనలో పోలీసులు రిమాండ్ చేసేందుకు ప్రయత్నించగా సాధ్యపడలేదు. ముందస్తు బెయిల్‌కోసం హైకోర్టు, సుప్రీం కోర్టును నాగిరెడ్డి ఆశ్రయించగా బెయిల్ నిరాకరించడంతో ఇటీవలే నాంపల్లి కోర్టులో లొంగిపోవడంతో అక్కడి నుంచి జైలుకు తరలించారు. పోలీసుల ఐదు రోజుల కస్టడీలో భాగంగా శుక్రవారం దోమ పోలీస్‌స్టేషన్‌లో నాగిరెడ్డిని విచారించినట్లు ఎస్ఐ వసంత్ జాదవ్ తెలిపారు.

రూ.12లక్షలు విలువ చేసే గుట్కా పట్టివేత

పరిగి,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పోలీసులు తనిఖీలో రూ.12లక్షలు విలువ చేసే నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఎస్ఐ మోహనకృష్ణ తెలిపారు. కేఏ01 ఏకే 7092 నంబరు గల కంటైనర్‌లో హైదరాబాద్ నుంచి కర్ణాటక ప్రాంతానికి తరలిస్తున్నట్లు విచారణలో తెలిందని తెలిపారు. గుట్కాలను స్వాధీనం చేసుకుని, కంటైనర్‌ను సీజ్‌చేసినట్లు తెలిపారు. కంటైనర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి



నవాబుపేట: పశువుల పాకను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవాబుపేట/బొంరాస్‌పేట్/కొడంగల్/కొడంగల్ రూరల్/కులకచర్ల/దోమ/మోమిన్‌పేట్/దుద్యాల/పరిగి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి అని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా దాదాపూర్, వట్టిమీనపల్లి గ్రామాల్లో పశువుల పాకను ప్రారంభించారు. అదే విధంగా వట్టిమీనపల్లిలో పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్ అంగన్‌వాడీ కేంద్రంలో మూత్రశాలను ప్రారంభించారు. అనంతరం పంచాయతీ కార్మికులకు ఆయా గ్రామాల్లో శాలువాలతో సన్మానించారు. బొంరాస్‌పేట్ మండలం టేకుల్‌గడ్డ తండాలో అంగన్‌వాడీ భవన నిర్మాణం, సూర్యనాయక్ తండాలో గ్రామ పంచాయతీ భవనం, సాలిండాపూర్‌లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. కొడంగల్ మండలంలోని టేకుల్‌కోడ్ గ్రామ పంచాయతీలో గల టేకుల్‌కోడ్ తండాలో శుక్రవారం ఎంపీడీవో ఉషశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్ అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. టేకుల్‌కోడ్ తండాలో రూ.8లక్షల నిధులతో చేపట్టిన నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను మార్కెట్ కమిటీ చెర్మన్ అంబయ్యగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌తో కలిసి ప్రారంభించారు. కులకచర్ల మండలంలోని సాల్విడ్ గ్రామం నుంచి నూతనంగా ఏర్పడిన దీప్లనాయక్ తండా పంచాయతీకి మంజూరైన కంపోస్టు షెడ్ పనులను శుక్రవారం ఎంపీడీవో రామకృష్ణ ప్రారంభించారు. దోమ మండలంలోని మోత్కూర్ పంచాయతీ పరిధిలో రైతు మల్లమ్మ వ్యవసాయ పొలంలో పశువులపాకకు ఎంపీడీవో గ్యామానాయక్ శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. మోమిన్‌పేట్ మండల కేంద్రంతో పాటు మేకవనంపల్లిలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణం, పశువుల పాకలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. దుద్యాల మండలంలో ఎంపీడీవో మహేశ్‌కుమార్, తహసీల్దార్ కిషన్‌నాయక్, అధికారులు తదితరులు శుక్రవారం పలు అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. పరిగి మండలంలోని మాదారం, పేటమాదారం, పొల్కంపల్లిలో ఎంపీడీవో ఏఎం కరీం పర్యటించి పశువుల పాక, మ్యాజిక్ సోక్‌పిట్స్ పనులను ప్రారంభించారు. దౌల్తాబాద్ మండలంలోని దేవరఫస్లాబాద్, యాంకి గ్రామాల్లో శుక్రవారం నూతన పంచాయతీ భవనాల నిర్మాణానికి కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో శంకుస్థాపన నిర్వహించారు.

నూతన కమిటీ ఎన్నిక

తాండూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తాండూరు స్టోన్ మర్చంట్ వెల్ఫేర్, క్వారీ ఓనర్స్ వెల్ఫేర్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్టోన్ మర్చంట్ అధ్యక్షుడిగా ఎంఏ నహీం, ఉపాధ్యక్షులుగా ఎంఏ సత్తార్, విజయ రామారావు, ప్రధాన కార్యదర్శిగా కుంచం మురళీధర్, సహాయ కార్యదర్శులుగా సయ్యద్ హబీబ్, బ్రిజ్ మోహన్ బూబ్, కోశాధికారిగా సంజీవ్ కుమార్ ఎన్నుకున్నారు. తాండూరు మండల క్వారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షులుగా ఓం ప్రకాష్ సోమాని, మహమ్మద్ అన్వర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ జుబేర్ పాషా, సహ కార్యదర్శులుగా శరణు బసప్ప, హర్షవర్ధన్‌రెడ్డి, కోశాధికారిగా మహమ్మద్ జైనోద్దిన్ ఎన్నుకున్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్

దారూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డిలు అన్నారు. కుక్కింద గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కమిషనర్ జ్యోతి

శామీర్‌పేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా ఆర్డీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట సీఐ రాజు, జీనమ్వ్యాలీ సీఐ గురవయ్యలు సూచించారు. అలియాబాద్ చౌరస్తాలోని శుభం ఫంక్షన్‌హాల్‌లో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ డీఈ సునీత, మూడుచింతలపల్లి మున్సిపల్ మేనేజర్ ఉష పాల్గొన్నారు. అదేవిధంగా తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జ్యోతి ఆధ్వర్యంలో జిల్లా ఆర్డీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా చేయాలని తెలిపారు.

తాండూరు రూరల్: వినాయక చవితి ఉత్సవాలపై శుక్రవారం తాండూర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్ అధ్యక్షతన ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. తాండూర్ డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, సీఐలు, ఎంపీడీవో విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

పూడూరు: వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వినాయక మండపాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని పూడూరు మండలం చెన్‌గోముల్ ఎస్ఐ భరత్‌కుమార్ తెలిపారు.

ఒక్కరోజు ముందుగానే వినాయక లడ్డు వేలం

తాండూరు: వినాయక నిమజ్జనం ఆలస్యం కాకుండా నిమజ్జనానికి ఒక్కరోజు ముందుగానే లడ్డు వేలం నిర్వహించాలని హిందూ ఉత్సవ సమితి నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్సవ సమితి గౌరవధ్యక్షుడు రాజ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు వినాయక చవితి ఉత్సవాల నిర్వాహణపై తాండూరు డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ బాలకృష్ణరెడ్డితో సమావేశమైయ్యారు. పట్టణ సీఐ సంతోష్ కుమార్, ఉత్సవ సమితి కోశాధికారి రొంపల్లి సంతోష్ ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మోమిన్‌పేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి సదానందం, ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను శుక్రవారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

సీపీఎస్ మహాధర్నా పోస్టర్ విడుదల

దోమ: వచ్చే నెల 1న ఇందిరాపార్కులో తలపెట్టిన సీపీఎస్ మహాధర్నా పోస్టర్‌ను పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కేశవులు శుక్రవారం దోమ, కిష్టాపూర్, ఊటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆవిష్కరించారు.

సత్యాగ్రహ దీక్షకు తరలిరావాలి

తాండూరు: ఈనెల 25న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో తలపెట్టిన సత్యాగ్రహ దీక్షకు తరలిరావాలని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు, తాండూరు నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు.

ఎట్టకేలకు రాకపోకలు ప్రారంభం

బొంరాస్‌పేట్: భారీ వర్షాల నేపథ్యంలో మండల కేంద్రంలో నిర్మిస్తున్న వంతెన నిర్మాణంలో భాగంగా తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడంతో వారం రోజులు మండల కేంద్రానికి రాకపోకలు నిలిచిపోగా గ్రామస్థులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. కాంట్రాక్టర్ నిర్మాణంలో ఉన్న వంతెనకు రెండు వైపులా మట్టితో చదును చేశారు. దీంతో వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి.

మత్తుకు బానిస కావొద్దు

కీసర: యువత మత్తుకు బానిస కావొద్దని కీసర సీఐ అంజనేయులు అన్నారు. భోగారంలోని మహత్మా జ్యోతిభాపూలే గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలపై, డ్రగ్స్ నిర్మూలపై అవగాహన కల్పించారు.

చెరువు కట్టకు మరమ్మతులు చేయండి

ధారూరు: గట్టేపల్లి శివారులో తెగిన లింగం చెరువు కట్టను, తూమును మరమ్మతు చేయాలని చెరువుకింద ఉన్న రైతులు కోరుతున్నారు. భారీ వర్షాలకు చెరువు నిండి తూము, చెరువు కట్ట తెగిపోయి నీరు పంట పొలాల్లో చేరుతుందని వారు చెప్పారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

మోమిన్‌పేట్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మర్పల్లి మండల ప్రత్యేకాధికారి కృష్ణ మోహన్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో శుక్రవారం జోనల్ స్థాయి ఖోఖో పోటీలను ప్రారంభించారు.

కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ కమిషనర్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నిత్యానంద్‌ను శుక్రవారం మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి సత్కరించారు.

దుద్యాలలో వాహన తనిఖీ

దుద్యాల: దుద్యాల ఎస్ఐ యాదగిరి గ్రామ స్టేజీ దగ్గర పోలీస్‌సిబ్బందితో కలిసి శుక్రవారం వాహన తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 18బైక్‌లు, 3 కార్లకు జరిమానాలు విధించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శామీర్‌పేట: మున్సిపల్ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ లను వెంటనే కల్పించాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం అలియాబాద్ గ్రంథాలయం వద్ద కార్మికులతో సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల నాలుగు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేత

తాండూరు రూరల్: చింతామణిపట్నం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మాజీ ఎంపీపీ రాజప్పగౌడ్ తన సొంత డబ్బులు రూ.15వేలతో ప్లేట్లు, గ్లాసులు, పాఠశాలకు కార్పెట్‌ను అందజేశారు. ఆయనను హెచ్ఎం శ్రీనివాస్ సన్మానించారు.

ఐకేపీ ఇన్‌చార్జి ఏపీఎంగా శివయ్య

బషీరాబాద్: బషీరాబాద్ మండల ఐకేపీ ఏపీఎంగా శివయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పెద్దేముల్ ఏపీఎంగా పనిచేస్తున్న ఆయనకు ఇక్కడా ఇన్‌చార్జి ఏపీఎంగా బాధ్యతలను అప్పగించారు. రెగ్యూలర్ ఏపీఎంగా పని చేసిన పద్మారావు బదిలీపై వెళ్లారు.